ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

శనివారం 23 నవంబరు 2024

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



చర్చీలకు సంబంధించిన వర్క్ ఆర్డర్లను అందిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 34 చర్చీలకు రూ 2 లక్షలు చొప్పున మైనార్టీ వెల్ఫేర్ ద్వారా మంజూరు చేసిన రూ 68 లక్షలు సంబంధించిన వర్క్ ఆర్డర్లను పాస్టర్లకు శుక్రవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చర్చిలకు సంబంధించి జీవో జారీ చేసి పనులు చేయకుండా పెండింగ్‌లో ఉండగా నిధులు వెనక్కి వెళ్లినట్లు పేర్కొన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి తిరిగి ఆర్డర్ కాపీలను పాస్టర్లకు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గొల్లపల్లి మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన గూడూరి సరోజనకు మంజూరు చేసిన రూ 90 వేల ఎల్‌వోసీ ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.

రైతుల ఖాతాలో బోనస్ జమ

జగిత్యాలరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం సన్నరకాలు పండించిన రైతుల ఖాతాలో రూ. 500 బోనస్‌ను శుక్రవారం జమ చేసింది. ఈసందర్భంగా జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి గ్రామంలోని ఐకేపీ, ధాన్యం కొనుగోలు కేంద్రంలోని సన్నరకాలు విక్రయించిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఏపీఎం గంగాధర్ మాట్లాడుతూ వెల్దుర్తి గ్రామంలో రైతులు పెద్దమొత్తంలో సన్నారకాల ధాన్యాన్ని పండించారని పేర్కొన్నారు. వెల్దుర్తి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు 928 క్వింటాళ్లు కొనుగోలు చేయగా 428 క్వింటాళ్లకు కనీస మద్దతు ధరతోపాటుగా రూ. 500 బోనస్ రైతుల ఖాతా ల్లో జమ అయినట్లు ఏపీఎం తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈవో రమ్య, సీసీలు మరియా, వీవోఏ జల, రైతులు గంగారాజం, మల్లయ్య, రాజం పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత

రాయికల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయంలో నిర్వహిస్తున్న గోశాలకు రామాజీపేట గ్రామానికి చెందిన కోల శంకర్ 50 గడ్డి కట్టలను ఉచితంగా అందజేశారు. శంకర్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మంద సాయిలు, మంద రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జగిత్యాల డీఈవో బదిలీ

జగిత్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల డీఈవో జగన్ మోహన్ రెడ్డిని బదిలీ చేస్తూ శుక్రవారం డైరెక్టర్ ఆఫ్‌స్కూల్ ఎడ్యుకేషన్ వెంకట నర్సింహ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాలలో పనిచేస్తున్న జగన్ మోహన్‌రెడ్డిని సిరిసిల్ల డీఈవో (ఫుల్ అడిషనల్‌చార్జీ)గా బదిలీ చేయడంతో పాటు ఆయన స్థానంలో జనగామ డీఈవోగా పనిచేస్తున్న రామును జగిత్యాల డీఈవో (ఫుల్ అడిషనల్ చార్జీ)గా నియమించారు. విద్యాశాఖలో ఇటీవల పలు అక్రమాలు, అవినీతిపై ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘంతో పాటు పలువురు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో డీఈవో బదిలీ చర్చనీయాంశంగా మారింది.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం

జగిత్యాల అర్బన్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) టీఎన్‌జీవో అనుబంధ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్‌ఫోరం జిల్లా నూతన కార్యవర్గం శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సాగి రామకృష్ణ రావు, కార్యదర్శిగా రామడుగు సంతోష్, కోశాధికారిగా రాఘవేంద్రలతో పాటు 17మందితో కూడి న కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జగిత్యాల టీఎన్‌జీవో అధ్యక్షుడు శశిధర్ గౌడ్, జనరల్ సెక్రటరీ నాగేందర్ రెడ్డి, సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బలరాం, ఉపాధ్యక్షులు సురేందర్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రవణ్ పాల్గొన్నారు.



సర్వే ఆన్‌లైన్‌కు కసరత్తులు

సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న కంప్యూటర్ ఆపరేటరు

- మండలానికి ఇద్దరు చొప్పున కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ పూర్తి
- ఈనెల 24వ వరకు పూర్తి కానున్న ప్రక్రియ
- జిల్లా వ్యాప్తంగా 620 కంప్యూటర్ ఆపరేటర్లతో పనులు
- జిల్లాలో ఈనెల 21వ తేదీ వరకు 95.51 శాతం సర్వే పూర్తి

జగిత్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయడానికి అధికారులు కసరత్తులు జరుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సర్వే దాదాపుగా చివరి దశకు చేరుకుంది. రానున్న రెండు, మూడు రోజుల్లో సర్వే వంద శాతం పూర్తికానున్నట్లు అధికార వర్గాలు అంటున్నాయి. సర్వేలో సేకరించిన కుటుంబాల వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు మండలానికి ఇద్దరు చొప్పున కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణను ఇచ్చారు. మాస్టర్ ట్రైనర్లు డేటా ఎంట్రీపై శిక్షణ ఇచ్చారు.

కలెక్టర్ సత్య ప్రసాద్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి కంప్యూటర్ ఆపరేటర్లకు దిశా నిర్దేశం చేశారు. ఆన్‌లైన్ నమోదుకు మండలాల వారీగా ఇన్‌చార్జీలను నియమించారు. మండల కేంద్రాల్లో గల మండలపరిషత్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు పలు ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సైతం సమగ్రసర్వే వివరాలను క్రోడీకరణ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. తొలుత శిక్షణ పొందిన కంప్యూట్ ఆపరేటర్లు ఆయా మండలాల పరిధిలో వివిధశాఖల నుంచి మరికొందరు డేటా ఎంట్రీ ఆపరేటర్లను తీసుకొని వారికి మరోసారి శిక్షణను ఇచ్చారు. అవసరాన్ని బట్టి ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను సైతం వినియోగించు కుంటున్నారు. ఇందుకు అవసరమైన కంప్యూటర్లను సమకూర్చారు.

జిల్లాలో 620 మంది ఆపరేటర్లు...

జిల్లా వ్యాప్తంగా 620 మంది కంప్యూటర్ ఆపరేటర్లు సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఒక్కో మండలానికి 20 మంది చొప్పున కంప్యూటర్ ఆపరేటర్లు క్రోడీకరణ ప్రక్రియలో భాగస్వాములవుతున్నారు. ఒక్కో ఆపరేటర్ రోజుకు 20 నుంచి 25 కుటుంబాల వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను సుమారు రెండు వందల మంది సూపర్‌వైజర్లు, పలువురు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. కుటుంబాల సంఖ్య ఆదారంగా నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సర్వే వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రత్యేక లాగిన్ కేటాయించి ఓటీపీ సాయంతో డేటా ఎంట్రీ చేసేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

(తరువాయి 8వ పేజీలో)

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు ప్రోత్సహించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు ప్రోత్స హించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశిం చారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాతా శిశు సంరక్షణలో భాగంగా వంద శాతం గర్భిణుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పుట్టిన ప్రతీ శిశువుకు వందశాతం వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ జ్వరాలు అదుపులో ఉంచడానికి కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. ఈకార్య క్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్ రెడ్డి, డాక్టర్ అర్చన పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్/ఎండపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం రోజున మండలంలోని కొత్తపేట గ్రామంలో జిన్నింగ్ మిల్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సంవత్సరకాలం కష్టపడి పండించిన పత్తి పంటను ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు కొత్తపేటలోని జిన్నింగ్ మిల్‌లో అమ్ము కొని రైతులు గిట్టుబాటు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రైతుల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తాటిపర్తి శైలెందర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, శ్రావణ్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలించాలి

● కలెక్టర్ సత్య ప్రసాద్



ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

8

కాంగ్రెస్ ప్రజాపాలన, చిత్తశుద్ధికి సూరమ్మ చెరువు పనులే నిదర్శనం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

8

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



విద్యార్థినిలతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

గొల్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనంను అందించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని పెగడపల్లి మహాత్మా జ్యోతిబా పూలే సాంఘీక సంక్షేమ బీసీ బాలికల గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ వసతి గృహం పరిసరాలను, తరగతి గదులను, విద్యార్థినిలకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికలను, ఉపాధ్యాయుల రిజిష్టర్‌లను, వసతి గృహంలోని విద్యార్థినుల రిజిష్టర్‌లను, రికార్డులను తనిఖీ చేశారు. వసతి గృహంలో ఏమైనా ఇబ్బందులపై ఆరా తీశారు. బోధన పద్ధతులు, మెనూ గూర్చి విద్యార్థులను ఆరా తీశారు. వసతి గృహంలోని వంటగదిని, స్టోర్ రూంను, బియ్యంను, కాయగూరలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందని వీటిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులకు కార్పొరేట్ ప్రమాణాలతో నాణ్యమైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం ప్రధానమని, అందుకు శుచి, శుభ్రతతోపాటు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆర్డీవో మధుసూదన్, బీసీ సంక్షేమశాఖ అధికారి సాయిబాబా, ఎంఈవో జమునా దేవి,రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌సీ స్పాట్ బిల్లులు చెల్లించండి

● ఎస్టీయూ జిల్లా శాఖ డిమాండ్



రాష్ట్ర అధ్యక్షులకు వినతిపత్రం సమర్పిస్తున్న జిల్లా ఎస్టీయూ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి జవాబు పత్రాలు దిద్ది రెండేళ్లు గడుస్తున్న రెండు స్పాట్ బిల్లులు ఇంతవరకు చెల్లించకపో వడం బాధాకరమని, తక్షణమే బిల్లులు చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2023, 2024 స్పాట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున ఈ సారి ఏప్రిల్‌లో జరగబోయే 2025 ఎస్ఎస్‌సీ పరీక్షల స్పాట్ కార్యక్రమాన్ని బహిష్కరిస్తామన్నారు. గతంలో పేపర్లు దిద్దిన వెంటనే చివరి రోజు రెమ్యూనరేషన్ చెల్లించే వారని, కానీ చిన్న జిల్లాలు ఏర్పడినా కూడా ఆలస్యం చేయడం దేనికని ప్రశ్నించారు. హైద్రాబాద్‌లోని కాచిగూడ ఎస్టీయూ భవన్‌లో రాష్ట్ర సంఘ అధ్యక్ష, కార్యదర్శులను కలిసి జిల్లా శాఖ పక్షాన విజ్ఞప్తి చేసి, ప్రభుత్వానికి రాష్ట్ర శాఖ పక్షాన విజ్ఞప్తి చేయాలని కోరారు.

విద్యార్థుల వసతులపై అలసత్వం వహించొద్దు

● కస్తూర్బా పాఠశాలలో వసతులు పరిశీలించిన అధికారులు



కూరగాయలను పరిశీలిస్తున్న కమీషనర్ తిరుపతి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో

కోరుట్ల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యార్థులకు అందిస్తున్న వసతులపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ దిలీప్ చంద్ర, జిల్లా సెక్టోరల్ అధికారి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని కస్తూర్బా పాఠశాలలో డిజిటల్ తరగతి గదులు, తాగునీరు వసతి, ఇంట రాక్ట్ ప్లాట్ పానెల్ బోర్డులను పరిశీలించారు. పాఠశాలలో వసతుల గురించి తెలుసు కోని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి సుమలత, సీఆర్‌పీ గంగాధర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొ న్నారు. మండలంలోని కస్తూర్బా పాఠశాలను కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతి పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించి నిలువ ఉన్న భోజన సామగ్రిని తనిఖీ చేశారు. పాఠశాలలోని పారిశుధ్య వసులను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాఠశాల స్పెషల్ ఆధికారిణి సుమలతకు వివరించారు.

విద్యాలయాలను తనిఖీ చేసిన అధికారులు

కొడిమ్యాల : కలెకర్ సత్యప్రసాద్ ఆదేశాలతో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను మండల ప్రత్యేక అధికారి చరణ్‌దాస్, మండలంలోని నంద్రల్లపల్లి గ్రామంలో కస్తూరిబా పాఠశాలను ఎంపీడీవో స్వరూప, మండలంలోని పూడూర్‌లోని వసతి గృహాన్ని తహసీల్దార్ రమేష్ శుక్ర వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోడల్ స్కూల్‌లో సోలార్ సిస్టం సరిగా పని చేయక వాటర్ హీటర్ పనిచేయటం లేదని విద్యార్థులు ప్రత్యేక అధి కారి చరణ్‌దాస్‌కు తెలిపారు.

గతంలో మోడల్ స్కూల్‌కు వరకు వచ్చిన బస్సు బస్టాండ్ వరకు రావటంతో తాము ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని బస్సు స్కూల్ వరకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు. అనంతరం ప్రత్యేక అధికారి వసతి గృహాన్ని భోజనాన్ని పరిశీలించి భోజనం చేశారు. కస్తూరీబా పాఠశాలలోని పలు గదుల కిటికీలకు జాలీలు లేవని విద్యార్థులు ఎంపీడీవో స్వరూపకు తెలిపారు. ఎంపీడీవో పరిసరాలతో పాటుగా కిచెన్, మరుగుదొడ్లను పరిశీలించారు. పూడూర్ వసతి గృహాన్ని తహసీల్దార్ రమేష్ తనిఖీ చేస్తుండగా పలువురు విద్యార్థులు బోరు పాడైందని నీటి సమస్య ఉందని తెలిపారు. అధికారుల వెంట కస్తూరిబా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రత్యేక అధికారి రమాదేవి, సూపరింటెండెంట్ సురేందర్, ఆర్.ఐ. కరుణాకర్ కార్యదర్శులు వం శీవర్ధన్, నవీన్, సిబ్బంది ఉన్నారు.

రాయికల్: రాయికల్ ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌ను తహసీల్దార్ ఎండీ ఖయ్యూం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం ఆరగించారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ గణేష్, హాస్టల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్ నాయక్ ఉన్నారు.

జ్వరంతో బాలుడి మృతి

భీమారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలో శుక్రవారం జ్వరంతో బాలుడు మృతి చెందాడు. భీమారం మండల కేంద్రానికి చెందిన ముంజ జలంధర్-శిరీషల కుమారుడు రిషి (13) కొన్ని రోజులుగా జ్వరంతో బాధ పడుతున్నారు. కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం కోరుట్ల ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం రిషిని కరీంనగర్ ఆస్పత్రికి శుక్రవారం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు.


రిషి (ఫైల్)

అనుమతి లేని ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గురువారం అర్థరాత్రి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకుని సీజ్ చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలో అర్ధరాత్రి సమయంలో ఎస్‌ఐ సత్తయ్యతో కలిసి పోలీసు బృందం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కోరుట్ల నుంచి నిజామాబాదు వైపు ఇసుక లోడుతో వెళుతున్న లారీ ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలను లేవని తెలపడంతో లారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. లారీ ఓనరైన అర్మూర్ పట్టణానికి చెందిన రజనీకాంత్ రెడ్డితో పాటు డ్రైవర్ ధారవేణి భూమయ్యపై కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక జ్యోతి ఐఐటీ అకాడమీకి చెందిన 9వ తరగతి విద్యార్థి సంజన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు తెలిపారు. నెల 21వ తేదీన చొప్పదండిలో జరిగిన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్ 17 నెట్ బాల్ పోటీల్లో గెలుపొంది, ఈ నెల 28నుంచి 5వ తేదీ వరకు మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర నెట్ బాల్ పోటీలకు ఎంపికైందన్నారు. పాఠశాల డైరెక్టర్‌లు హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, అజితరావు, రజితరావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కంకర వేశారు.. తారు మరిచారు

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


మొగిలిపేటలో కంకర దుమ్ముతో కూడిన రహదారి

మల్లాపూర్, నవంబరు, 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రహదారిల పునరుద్ధరణలో భాగంగా మండలంలోని మొగిలిపేట ప్రధాన రహదారి గుంతలమయంతో ప్రమాదకరంగా మారడంతో మరమ్మతులకు నిధులు మంజూరు చేశా రు. కానీ రోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి తారు మరవడంతో దుమ్ము, దూళి, గుంతలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాల్పడుతున్నారు. ప్రతి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, వేల సంఖ్యలో ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. గుంతల మయంగా మారిని రహదారిపై మరమ్మతుల కింద 45 రోజుల క్రితం కంకర పోసి వదిలేశారు. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అపార్ కార్డులు తప్పని కష్టాలు



- పాఠశాల రికార్డులతో సరిపోలని ఆధార్ వివరాలు
- చాలా మంది విద్యార్థుల వ్యక్తిగత వివరాల్లో తేడాలు



వెల్గటూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న ఒకటవ తరగతి నుంచి 12వ తరగతి వరకు గల విద్యార్థులకు అపార్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. వన్ నేషన్ వన్ కార్డులో భాగంగా ఆటో మేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో 12 అంకెల సంఖ్యతో కార్డు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు వీటిని జారీ చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో అన్ని పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో సేకరించే కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థుల పురోగతిని అంచనా వేయడానికి ఇది ఉపయోగపడు తుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే విద్యార్థులకు ఆధార్ నెంబర్, పెన్ నెంబరు కేటాయించినప్పటికీ, దేశవ్యాప్తంగా విద్యార్థికి అపార్ పేరుతో మరోనెంబర్ కేటాయించే కార్యక్రమం ప్రారంభించారు.

నత్త నడకన నమోదు

నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జీవితకాల గుర్తింపు సంఖ్యతో అపార్ కార్డు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 1165 ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో కలిపి 1,60,152 మంది విద్యార్థులకు అపార్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో నమోదు ప్రక్రియ నత్త నడకన సాగుతున్నట్లు అధికారిక లెక్కలే తెలుపుతున్నాయి. జిల్లాలో 109 పాఠశాలలు మాత్రమే కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించగా మొత్తం మీద కేవలం సుమా రు 5 వేల మంది విద్యార్థుల నమోదు ప్రక్రియ మాత్రమే పూర్తి అయినట్లు తెలుస్తోంది. కార్డుల జారీకి కష్టాలు తప్పడం లేదు.

రికార్డులకు సరిపోలని వివరాలు

చాలా మంది విద్యార్థుల వివరాలు పాఠశాల రికార్డుల్లో ఒక రకంగా ఉండగా ఆధార్ కార్డుల్లో మరో రకంగా ఉంటున్నాయని ప్రధానోపాధ్యాయులు తెలుపుతున్నారు. కొంత మంది వివరాలు మాత్రమే ఆధార్ కార్డులతో సరిపోతున్నాయని తెలుస్తోంది.

పిల్లలు చిన్న తనంలో ఉన్నపుడు ఆధార్ తీయడంతో ఆధార్ నమోదులోనే ఎక్కువగా తప్పులు ఉంటున్నాయని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నారు. విద్యార్థులకు అపార్ నెంబరు ఆన్‌లైన్‌లో కేటాయించాలంటే విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రంలో గల వివరాలకు, ఆధార్‌లో ఉన్న వివరాలకు, పాఠశాల అడ్మిషన్ రికార్డులో గల వివరాలకు సరిపోవాలి. మూడింటి వివరాలు సరి పోతేనే అపార్ నెంబర్లు జనరేట్ అవుతున్నాయి. ఈ మూడింటిలో విద్యార్థుల వివరాలు సరిపోకపోతే ఆ విద్యార్థికి ఆన్ లైన్‌లో అపార్ నెంబరు జనరేట్ కావడం లేదు. దీంతో ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకునే పరిస్థితి వచ్చింది.

అపార్ నమోదు కొనసాగుతుంది
మండల విద్యాధికారి ప్రభాకర్



విద్యాశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలో అపార్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. కొన్ని సాంకేతిక కారణాల వలన ఆన్ లైన్ మందకొడిగా సాగుతోంది. విద్యార్థుల అన్ని వివరాలు సరిపోలితేనే అపార్ జనరేట్ అవుతుంది. త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం.


ఆటోను బయటకు తీస్తున్న పోలీసులు

ఘాట్‌రోడ్డుపై అదుపు తప్పిన ఆటో

- విద్యుత్ స్తంభానికి ఢీ
- అంజన్న దర్శనం చేసుకొని వెలుతుండగా ఘటన


మల్యాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజన్న దర్శనం చేసుకొని తిరిగి వెలుతున్న భక్తుల ఆటో ఘాట్ రోడ్డుపై అదుపు తప్పి విద్యుత్‌స్తంబానికి ఢీకొంది. మంచిర్యాల జిల్లాలోని మందమర్రికి చెందిన ఓ కుటుంబం దైవదర్శనం నిమిత్తం కొండగట్టుకు వచ్చి వెలుతుండగా గతంలో ఆర్టీసీ బస్సు ప్రమాదం జరిగిన చోట ఆటో అదుపుతప్పి ఘాట్‌రోడ్డు పక్కన గల విద్యుత్‌స్తంబానికి ఢీకొని గతంలో ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన రక్షణగోడ వద్ద నిలిచింది. ఈ ప్రమాదంలో ఆటోలో గల వారందరూ క్షేమంగా బయట పడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటోను జేసీబీ సహాయంతో రక్షణగోడ నుంచి లాగి బయటకు తీశారు.

ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

- క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్లు
- ముగ్గురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు


ప్రమాద స్థలంలో డ్రైవర్లను బయటకు తీస్తున్న పోలీసులు

మల్యాల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు సమీపంలో శుక్ర వారం వేకువజామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాల య్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్ నుంచి కరీంనగర్ వైపు వెలుతున్న లారీ, ఆంధ్ర ప్రదేశ్‌లోని ఎన్టీయార్ జిల్లా నుంచి పత్తి లోడ్‌తో జగిత్యాల వైపు వస్తున్న లారీ రెండు కొండగట్టు సమీపంలో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రెండు లారీల ముందు బాగాలు నుజ్జు నుజ్జు కావడంతో క్యాబిన్‌లో డ్రైవర్లు దేవీలాల్, వీరయ్యలు ఇరుక్కు పోయారు. దీంతో పలువురు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు జేసీబీ సహాయంతో క్యాబిన్‌లో ఇరుక్కొని తీవ్ర గాయాలపాలైన డ్రైవర్లను బయటకు తీశారు. వారితో పాటు లారీలో గల మరో వ్యక్తి శ్రీనివాస్ రెడ్డికి కూడా గాయాలు కాగ గాయపడిన వారిని చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

సిగరెట్ తాగవద్దన్నందుకు

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

కోనరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు సిగరెట్ తాగవద్దన్నారని పదో తరగతి విద్యార్థి శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన అలువాల వెంకటేష్ (16) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజులుగా సిగరెట్‌కు అలవాటు పడ్డాడు. ఈ విషయమై గతంలో తల్లిదండ్రులు మందలించగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స చేయించడంతో కోలుకున్నాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులు, స్నేహితులతో ముభావంగా ఉంటున్నాడు. గురువారం సిగరెట్ తాగవద్దని, చదువుకోవాలని తల్లిదండ్రులు సూచించారు. దీంతో తరుచూ తనను సిగరెట్ తాగవద్దంటున్నారని కోపంతో శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- సీఎం సభ ముట్టడికి బీసీ సంఘం పిలుపు
- పలు పార్టీల మద్దతు కోరుతున్న నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కరీంనగర్‌లో జరిగే సీఎం సభ ముట్టడికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు ప్రతిపక్ష నాయకులకు విద్యార్థుల సమస్యలు వివరిస్తూ గత 3 సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని దీనివలన విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఇప్పటికీ ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదని తెలిపారు. మూసీ సుందరీకరణ చేస్తామని చెప్పే ప్రభుత్వం విద్యార్థులను మాత్రం గాలికి వదిలేస్తున్నదన్నారు. కరీంనగర్‌లో త్వరలో జరుగనున్న సీఎం సభను బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. దీనికి పలు రాజకీయ పార్టీలు వారి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు హామీ ఇచ్చారన్నారు. యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్‌రాజు ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీల మద్దతు కోరారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

ఇల్లంతకుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్‌లో వ్యవసాయ బావుల వద్ద నుంచి ఇద్దరు రైతులకు చెందిన మోటార్లు చోరీకి గురయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, కేతిరెడ్డి రాంరెడ్డి వ్యవసాయ బావుల వద్ద గదులు నిర్మించుకొని వ్యవసాయ పరికరాలు అందులో ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి తాళాలు పగలగొట్టి వ్యవసాయ మోటార్లు, పంపులు, విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లారు. మరో రైతు కేతిరెడ్డి మధుసూదన్‌రెడ్డికి చెందిన గది తాళాలు పగలగొట్టడానికి ప్రయత్నించారు. దాదాపు 1.30 లక్షల మోటార్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు.

అంజన్న హుండీల లెక్కింపులో నిర్లక్ష్యం..



మల్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల లెక్కింపు సందర్భంగా పర్యవేక్షణపై నిర్లక్ష్యం కనబడుతోంది. తరచూ దొంగతనాలు చోటు చేసుకుంటున్నప్పటికీ లోపాలు సరిద్దికపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా గురువారం హుండీల లెక్కింపు చేపట్టగా నోట్ల లెక్కింపు పూర్తి అయ్యాక అనుమానం వచ్చిన కొందరి అభ్యంతరం మేరకు మళ్లీ లెక్కింపు చేయడంతో సుమారు రూ. పది వేల వరకు ఎక్కువ వచ్చిన్నట్లు కొండపై చర్చించు కుంటున్నారు. కోటికి పైగా ఆదాయం రాగా అందులో 90శాతం నోట్లు ఉంటాయి. ఈ రకంగా మొత్తం లెక్కింపు చేపట్టిన నోట్లను రీకౌంటింగ్ చేస్తే ఇంకా ఎక్కువగా నోట్లు రావచ్చుననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే ఆలయ సిబ్బం ది ఒకరు చేతిలో వస్తువులను ఉంచు కోవడంతో అక్కడి మిగితా సిబ్బందికి అనుమానం రాగా గుర్తించిన అత ను దాన్ని కౌంటింగ్ డబ్బాలో వేశాడని, కొందరు దాన్ని ఫొటోలు కూడా తీసినట్లు చర్చించుకుంటున్నారు.

ఆయన చేతిలో ఉన్న దానిని బంగారంగా అనుమా నిస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో రామకృష్ణ రావును ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులో లేరు. గతంలోనూ లెక్కింపు సమయంలో సిబ్బంది

నోట్ల లెక్కింపులోనూ పర్యవేక్షణ కరువు

చేతివాటానికి పాల్పడిన సంఘటనలు ఉండగా కౌంటిం గ్ ప్రక్రియపై తరచూ విమర్శలు వస్తూనే ఉన్నాయి. హుండీల కౌంటింగ్ సందర్భంగా దేవస్థానం అధికారులు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో దేవస్థానం అధికారులకు తోడు పోలీసుల సమక్షంలో కౌంటింగ్ చేపడుతుంటారు. ఈ లెక్కింపునకు వివిధ ట్రస్ట్‌లకు సంబంధించిన సిబ్బంది నోట్లు లెక్కింపు, నోట్లు వేరు చేస్తుండగా పర్యవేక్షణ అంతంతమాత్రమేనని అందుకే తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ప్రతిభ చాటిన విద్యార్థినికి అభినందన


రష్మితను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

హుజూరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న నల్లగొండ రష్మిత అనే విద్యార్థిని 10 కిలో మీటర్ల ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ ఈవెంట్లో ప్రతిభ చాటడంతో శుక్రవారం ప్రిన్సిపాల్ ఇందిరాదేవి అభినందించారు. రష్మిత శాతవాహన యూనివర్సిటీ తరుపున గురువారం కర్ణాటకలోని మంగళూరు యూనివర్సిటీలో నిర్వహించిన క్రీడా పోటీలో పాల్గొన్నది. ప్రతిభ చాటిన రష్మితను కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, సమన్వయకర్త మంగమ్మ, వైస్ ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, అధ్యాపకులు లింగారెడ్డి, రేణుక, షైపాలిరెడ్డి, ఓదెలు, రూప్సీరాణి, సుమలత, స్వరూపరాణి, రమ, పల్లవి, స్వప్న అభినందించారు.

24న రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం సమావేశం

సుభాష్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం సమావేశాన్ని ఈ నెల 24న నిర్వహించను న్నట్లు సంఘం ప్రధానకార్యదర్శి మహేందర్ రాజు తెలిపారు.

శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం మొదటి విడత సమావేశం వరంగల్‌లో, రెండో విడత సమావేశాన్ని కరీంనగర్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. మానకొండూరులో నిర్వహించే ఈ సమావేశంలో కార్యవర్గ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. అంతే కాకుండా సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘం ఆధ్వర్యంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యక్రమాల గురించి చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో సలహాదారుడు బుచ్చిరెడ్డి, చక్రపాణి, రాజగోపాల్, మధుసూదన్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రాజు

దాడి ఘటనలో కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ భారత్ టాకీస్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన దాడి ఘటనలో నిందితులపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ సీఐ బిల్లాకోటేశ్వర్ తెలిపారు. పెళ్లి బరత్‌లో జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకొని సాహిత్ యాదవ్ అనే వ్యక్తి తన సోదరుడు రిషు, మరో ముగ్గురి స్నేహితులతో కలిసి చింతల విజేందర్ రెడ్డి అనే వ్యక్తిపై కె ఎస్ఎల్ లాడ్జి కారిడార్‌లో రాడ్డుతో ముఖం మీద దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. అడ్డు వచ్చిన వారిని కూడా కొట్టాడని, ఈ మేరకు బాధితుడు విజయేందర్‌రెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈ దాడి ఘటనలో నిందితులైన ఐదుగురు వ్యక్తుల పై కేసు నమోదు చేశామన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజులు జైలు శిక్ష

సైదాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ హుజూరాబాద్ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య శుక్రవారం తీర్పునిచ్చారు. సైదాపూర్ ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి బండి నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరు పరుచగా మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.


చెక్కును అందిస్తున్న వధూవరులు

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఔదార్యం

ప్రభుత్వ పాఠశాలలో వాటర్ కూలర్ల కోసం రూ.50 వేల విరాళం

సుల్తానాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తన వివాహాన్ని పురస్కరించుకుని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విరాళం ప్రకటించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం రెండు వాటర్ కూలర్లను సమకూర్చుకునేందుకు యాభై వేల రూపాయలను అందించారు. సుల్తానాబాద్‌కు చెందిన బూడిద స్వామి కరీంనగర్ ఆర్టీసీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయన కుమారుడు ప్రియతమ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హైదరాబాద్‌లో పని చేస్తున్నారు. ప్రియతమ్ వివాహం పురస్కరించుకుని వారు స్థానిక ప్రభుత్వ పాఠశాలకు రెండు వాటర్ కూలర్లను సమకూర్చాలని భావించారు. ఈ మేరకు వివాహ వేడుక వేదికపైన సంబంధిత ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదకు యాభై వేల రూపాయల చెక్కును శుక్రవారం నూతన దంపతులు ప్రియతమ్- షరిష్మాలు అందజేశారు. హెచ్‌ఎంతో పాటు వేదికపై ఉన్న మాజీ జడ్పీటీసీ అయిల రమేష్, మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ బిరుదు సమత క్రిష్ణ అభినందించారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజన్న ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్న ఆలయంలోని గండదీపంలో నూనెపోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమపూజలో పాల్గొని, బద్దిపోచమ్మను దర్శించుకొని తిరిగి ప్రయాణమయ్యారు. ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న మధుప్రియ



సింగర్ మధుప్రియకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని సింగర్ మధుప్రియ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆమె వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రామగుండంకు నర్సింగ్ కళాశాల

- రూ.26కోట్లు మంజూరు చేస్తూ జీవో జారీ



సింగరేణి మెడికల్ కళాశాల

కళ్యాణ్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రామగుండంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటు కానున్నది. నర్సింగ్‌కళాశాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో నంబరు 183ను జారీ చేసింది. ఏడాదికి 60సీట్ల కెపాసిటీతో ఈ కళాశాలను ఏర్పాటు చేస్తున్నారు. సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) కు అనుబంధంగా ఈ కళాశాల ఏర్పాటు కానున్నది. ఈ మేరకు శుక్రవారం వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టియానా జెడ్ చుగుంత్ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎంఎస్‌ఐడీసీ) ఆధ్వర్యంలో నిర్మాణం జరుగనున్నది. కళాశాల నిర్మాణం, సామాగ్రి కొనుగోలుకు రూ.26కోట్లు మంజూరు ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరం నుంచే కళాశాల నిర్వహించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్, బీడీఎస్, పారా మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గతంలో విజ్ఞప్తి చేశారు. డెంటల్ కళాశాల కూడా మంజూరయ్యే అవకాశం ఉన్నది.

ఒగ్గుకథలో దిట్ట..

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగోని చంద్రమౌళిగౌడ్.. కులవృత్తికి భిన్నంగా ఒగ్గుకథలపై మక్కువ పెంచుకున్నాడు. అప్పట్లో అంతర్జాతీయ ఒగ్గుకథ కళాకారుడు మిద్దెరాములును స్ఫూర్తిగా తీసుకున్నాడు. తన అన్న వద్ద ఒగ్గుకథలు చెప్పడం నేర్చుకున్నాడు. గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో ఒగ్గుకథను ప్రదర్శిస్తూ ఎన్నో ఏళ్లుగా ప్రశంసలందుకుంటున్నాడు.

- మిద్దెరాములు స్ఫూర్తితో కళాసాధన.. వేల సంఖ్యలో ప్రదర్శనలు..
- ఉత్తమ కళాకారుడిగా గోపగోని చంద్రమౌళిగౌడ్‌కు జాతీయ స్థాయి అవార్డు





ఒగ్గుకథను ప్రదర్శిస్తున్న చంద్రమౌళిగౌడ్

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగోని చంద్రమౌళిగౌడ్ ఒగ్గుకథ కళాకారుడిగా రాణిస్తున్నాడు. 20 ఏళ్ల వయస్సులో మిద్దె రాములు స్ఫూర్తితో చంద్రమౌళిగౌడ్ ఒగ్గుకథ నేర్చుకున్నాడు. చిన్నతనంలోనే జానపద గేయాలు పాడే చంద్రమౌళి ఒగ్గుకథ నేర్చుకోవాలని ఆలోచనతో మిద్దె రాములును స్ఫూర్తిగా తీసు కున్నాడు. ఒగ్గు కథ కళాకారుడైన తన అన్న గోపగోని ఓదెలు వద్ద శిష్యరికం చేసి ఒగ్గు కథను నేర్చుకున్నాడు. తర్వాత బృందాన్ని ఏర్పాటు చేసుకొని గత 26 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా రెండు వేలకు పైగా ప్రదర్శనలిచ్చి ప్రజల మన్ననలు పొందాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఒగ్గు కథ ద్వారా ప్రజల్లో చైతన్యం నింపి ప్రజా గాయకుడు గద్దర్ ప్రశంస లందుకున్నాడు.

అప్పట్లో హైదరాబాద్ జరిగిన కళోత్సవాల్లో ఒగ్గు కథ చెప్పి ఉత్తమ ఒగ్గుకథ అవార్డును అప్పటి ప్రభుత్వ సలహాదారుడు కేవీ రమణ చారి చేతుల మీదుగా అందుకున్నాడు. ప్రభుత్వ కార్య క్రమాలు, ఎయిడ్స్, అక్షరాస్యత, కుటుంబ నియం త్రణ, మద్య పాన నిషేధంపై ప్రభుత్వం నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొని పలువురి ప్రశంసలు అందుకున్నాడు. చంద్రమౌళిగౌడ్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. స్వగ్రామంలో ఓ వైపు హోటల్ నడిపించుకుంటూ మరోవైపు గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో చంద్రమౌళిగౌడ్ ఒగ్గు కథ ప్రదర్శనలు ఇస్తున్నాడు.

న్యూస్ బాక్స్

గోదావరి మహా హారతి పోస్టర్ ఆవిష్కరణ

ధర్మపురి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఎదుట గోదావరి మహాహారతి వాల్ పోస్టర్‌ను ఉత్సవ సమితి రాష్ట్ర కో కన్వీనర్ డామెర రాంసుధాకర్‌రావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంసుధాకర్‌రావు మాట్లాడుతూ ధర్మపురి క్షేత్రంలో 13 ఏళ్లుగా గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 30 శనివారం సాయంత్రం జరిగే గోదావరి మహా హారతి కార్యక్రమానికి విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠా ధిపతి, పూజ్య శ్రీ ఆతిదేశ్వరానంద పర్వత హాజరవుతారని పేర్కొన్నారు. బ్రహ్మశ్రీ పాలెపు భరత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి రాష్ట్ర కన్వీనర్ లింగంపెల్లి వీరగోపాల్, కో కన్వీనర్ బల్గూరి సంతోష్‌రావు హాజరవుతారని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, సభ్యులు సురేం దర్‌రెడ్డి, నర్సింహమూర్తి, లక్ష్మీనర్సయ్యగౌడ్, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కస్తూరి రాజన్న, సంగి నర్సయ్య పాల్గొన్నారు.

మిడ్ మానేరు నిర్వాసితులను కేసీఆర్ ప్రభుత్వం మోసగించింది

- కాంగ్రెస్ ప్రభుత్వమైన ఆదుకోవాలి - సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

సిరిసిల్ల టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు నిర్వాసితులకు ఇళ్ల నిర్మించుకోవడం కోసం గత కేసీఆర్ ప్రభుత్వం రూ. 5లక్షల 4వేలు ఇస్తామని మాట ఇచ్చి మోసం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వేణు మాట్లాడారు. మిడ్ మానేరు కోసం 12 వేల కుటుంబాలు ఇళ్లు, వ్యవసాయ భూములు కోల్పోయారని 25 టీఎంసీల నీటి నిల్వకు సహకరించిన నిర్వాసిత కుటుం బాలను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. త్యాగాలు చేసిన మిడ్ మానేరు నిర్వాసితులను గత కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. నిర్వాసితులందరు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకొని వేములవాడ, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం కృషి చేశారన్నారు. మిడ్ మానేరు నిర్వాసితులందరికీ రూ. 5లక్షల 4వేలు ఇవ్వాలన్నారు. 1200వేల మంది నిర్వాసిత కుటుంబాలు ఉంటే కేవలం 4,696 మంది కుటుంబాలకే ఇవ్వడం అనేది బాధాకరమన్నారు. అప్పులు చేసి ఇళ్లు నిర్మాణం చేసుకున్న కుటుంబాలు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇళ్లు నిర్మించుకోవడానికి జీవో ఉన్న విషయాన్ని ప్రభుత్వం మరిచిపోవద్దన్నారు. తరతరాలకు నీరు అందించే మిడ్ మానేరు నిర్మాణం కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల 4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు రావాల్సిన కుటుంబ ప్యాకేజీ రూ.2 లక్షలు, నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలన్నారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళలు చేపడతామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు, శ్రావణపల్లి మల్లేశం, బాదుపల్లి శంకర్ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో అధికారుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం వసంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజలి జిల్లా పరిధిలోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లలోని రికార్డులను, ఆడిట్ రికార్డులను, రిపోర్ట్‌లను పరిశీలించారు. నిబంధనలు అనుసరించి స్కానింగ్ సెంటర్లను నిర్వహించాలని సూచించారు. స్కానింగ్ మిషన్లను సర్టిఫికెట్లలో రిజిస్ట్రేషన్ తప్ప నిసరిగా ఉండాలని లేకుంటే స్కానింగ్ మిషన్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీలలో హెచ్‌ఈ బాలయ్య, సీహెచ్‌వో బాలచంద్రం పాల్గొన్నారు.

21వ రోజు ఘనంగా గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి హారతి 21వ రోజు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు క్రీడాపాఠశాల విద్యార్థులు



క్రీడాపాఠశాల విద్యార్థులతో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 అథ్లెటిక్స్ పోటీలకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని క్రీడాపాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ఖమ్మం, హనుమకొండలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో క్రీడాపాఠశాల విద్యార్థులు దీపిక, రేవతి, వైశాలి, జాహ్నవి పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 26 నుంచి 30 వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు.

- ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన నెల్లి అనిహాశ్రీ రాజ్‌కోట్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. జాతీయస్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులను ఉత్తేజపరి చేందుకు కలెక్టర్ లగేజ్ బ్యాగులను అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, అథ్లెటిక్స్ కోచ్ పవన్, స్విమ్మింగ్ కోచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి పరిస్థితుల్లో కరాటే మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరి

- మహిళలకు ఆత్మరక్షణ క్రీడగా కరాటే - సినీ హీరో సుమన్ - ప్రారంభమైన జాతీయస్థాయి కరాటే పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణంరాజు సతీమణి శారదాదేవి, హీరో సుమన్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ కరాటే మార్షల్ ఆర్ట్స్ తప్పనిసరి అని సినీ హీరో సుమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న కృష్ణంరాజు మెమోరియల్ జాతీయస్థాయి కరాటే పోటీలను ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మా ట్లాడారు. ప్రపంచంలోనే నెంబర్ వన్ క్రీడగా కరాటే వెలుగొందుతుందన్నారు. మహిళలకు ప్రత్యేకించి బాలికలకు మార్షల్ ఆర్ట్స్ ఒక ఆత్మరక్షణ క్రీడగా ఉపయోగపడుతుందన్నారు. కరాటేతో శారీరక పటుత్వం పెంపొందుతుందని, విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ కరాటేలో శిక్షణ పొందాలన్నారు. మరో అతిథి సినీ హీరో కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి మాట్లాడుతూ కరాటేతో మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం పెంపొం దుతాయన్నారు. పాఠశాల స్థాయిలో కరాటే ను ప్రభుత్వాలు తప్పనిసరి క్రీడగా చేయా లని సూచించారు. జాతీయస్థాయి పోటీల నిర్వాహకుడు, కాయ్ జాతీయ సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోని 15 రాష్ట్రాల నుంచి వెయ్యి మంది క్రీడకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్ర మంలో సీఎస్‌కే చైర్మన్, కరాటే సంఘం జిల్లా అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఒలంపిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, కాయ్ చైర్మన్ కే వసంత్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌరు రాజిరెడ్డి, కరాటే సీనియర్ మాస్టర్ వేణుగోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడుగుల ప్రవీణ్, జిల్లా కార్యదర్శి ఆర్ ప్రసన్న కృష్ణ, కోశాధికారి వంగల శ్రీధర్, అన్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న చిన్నారులు

రేపటి నుంచి కాచిగూడకు ప్రత్యేక రైళ్లు

కరీంనగర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి కాచిగూడకు ఆదివారం నుంచి ప్రత్యేక రైళ్లు నడిపునున్నట్లు కరీంనగర్ రైల్వే స్టేషన్ మేనేజర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఈ ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 24, 25, 26, 28 తేదీల్లో కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక రైలు బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు కాచిగూడకు చేరుకుంటుందన్నారు. తిరిగి మధ్యాహ్నం మూడు గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి రాత్రి 11.15 గంటలకు కరీంనగర్‌కు చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

చిన్న వయస్సు.. పెద్ద మనసు

- బర్త్‌డే, డిసెంబరు 31 వేడుకలకు దూరం
- ఆ డబ్బుతో పేదలకు సేవా కార్యక్రమాలు
- జ్యోతిక, కౌశిక్‌ల ఉదారతకు ప్రశంసలు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పురస్కారాలు



దివ్యాంగులకు వీల్‌చైర్ అందిస్తున్న జ్యోతిక, కౌశిక్

పుట్టిన రోజు, డిసెంబరు 31 వేడుకుల పేరిట డబ్బులు వృథా చేయవద్దని, ఆ డబ్బుతో పేదలకు ఏదైనా సహాయం చేయాలన్నది ఆ చిన్నారుల సంకల్పం. కరోనా విపత్తు సమయంలో పేదలు తిండి లేక పస్తులున్న నిస్సహాయ స్థితి వారిని కదిలించింది. తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీని దాచి పెట్టి ఆ డబ్బులతో పేదలకు నిత్యావసర సరుకులను అందించారు సుల్తానాబాద్ పట్టణానికి చెందిన జ్యోతిక, కౌశిక్. వారి సేవాగుణానికి గుర్తించిన వివిధ సంస్థలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులతో సత్కరించాయి.

సుల్తానాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వారి వయస్సు చిన్నదే అయినా మనసు పెద్దది. తమ పుట్టిన రోజు వేడుకలను, ఇయర్ ఎండింగ్ సెలబ్రేషన్స్ జరుపుకోకుండా ఆ డబ్బుతో పేదలకు సహాయం చేయాలని భావించారు. అలా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి పలువురి మన్ననలు పొందారు. కరోనా సమయంలో ప్రైవేట్ పాఠశాలలు మూతపడడం, యాజమాన్యాలు వేతనాలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ టీచర్ల కుటుంబాల పోషణ భారంగా మారింది. ఈ నేపథ్యంలో దాదాపు 207 మంది టీచర్లకు పలువురు దాతల సహకారంతో నిత్యావసర సరుకులు అందించారు. కరోనా బాధితులకు సేవలందించారు. 167 మంది కరోనా పేషంట్లకు అవసరమైన పాలు, బ్రెడ్లు, పండ్లు అందించారు. అవసరమైన వారికి భోజనాలు సమకూర్చారు. టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులకు ఏదైనా సహాయం చేయాలని వారు ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త స్పందన లభించింది.

● పుట్టిన రోజు వేడుకలు మానుకుని..

సుల్తానాబాద్ పట్టణంలోని ద్వారకానగర్‌కు చెందిన ఏగోలపు సదయ్య-సుజాత దంపతులకు ఇద్దరు సంతానం. కూతురు జ్యోతిక, కుమారుడు కౌశిక్‌లు తమ పదో ఏట నుంచి పుట్టిన రోజు జరుపుకోవడం మానుకొని వాటికయ్యే ఖర్చుతో పేదలకు ఏదైనా సేవ చేయాలని సంకల్పించారు. ఆర్థికంగా ఉన్న వారు కానీ, మధ్య తరగతి వారు కానీ తమ పిల్లల పుట్టిన రోజు పేరిట వేడుకలు నిర్వహించడం, వాటికి పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేయడం సరికాదని జ్యోతిక కౌశిక్‌లు భావించారు. అలాగే డిసెంబర్ 31 పేరిట వృథా ఖర్చు చేయవద్దని, ఆ డబ్బుతో పేదలకు సహాయం చేయాలని, తాము దీనిని ఆచరిస్తున్నామంటూ చేసిన చాలెంజ్ చాలా మంది పిల్లలను ఆలోచింపజేసింది. దాంతో వారు కూడా సేవా కార్యక్రమాలు చేపట్టారు.

● పాకెట్ మనీతో పాటు దాతల సహకారం..

తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో పాటు దాతల సహకారంతో జ్యోతిక, కౌశిక్‌లు సుల్తానాబాద్ పట్టణమే కాకుండా పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా తమ సేవా కార్యక్రమాలను చేపట్టారు. అనేక మంది పేద విద్యార్థుల ఫీజులు చెల్లించి ఆదుకున్నారు. వికలాంగులకు అవసరమైన పరికరాలు అందించారు. పేదలకు నెలరోజుల పాటు సరిపడా నిత్యావసర సరుకులు సమకూర్చారు. పండుగల సందర్భంలో కొత్త బట్టలు అందించారు. చలికాలంలో అనాథలకు, యాచకులకు ఉన్ని దుస్తులు కొనిచ్చారు. ఇలా గత ఆరు సంవత్సరాల నుంచి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.



పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న చిన్నారులు (ఫైల్)

● రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు

జ్యోతిక, కౌశిక్‌లు చేస్తున్న సేవలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. అనేక సంస్థలు వీరికి అవార్డులు ప్రకటించి సన్మానాలు చేశాయి. ఎంతో మంది ప్రముఖులు వీరి ఉదారతను ప్రశంసించి సన్మానించారు.



జ్యోతిక, కౌశిక్‌లను సన్మానిస్తున్న సినీ నటుడు సుమన్ (ఫైల్)

కుటుంబ వివరాల నమోదు ప్రారంభం

కొడిమ్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదును (డాటా ఎంట్రీని) మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో 14510 కుటుంబాలను అధికారులు గుర్తించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 98 మంది ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి కుటుంబంలోని సభ్యుల వివరాల సేకరించారు. 20 మందికి ప్రత్యేకంగా డాటా ఎంట్రీపై శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. ఎన్యుమరేటర్లు సేకరించిన సమాచారాన్ని ఎంపీడీవో ఇ. స్వరూప ఆధ్వర్యంలో 20 మంది ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. శుక్రవారం ఎంపీడీవో స్వరూప ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ నమోదు చేసిన కుటుంబాల వివరాలను పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో డాటాను ఎంట్రీ చేస్తామన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

మేడిపల్లి, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : మేడిపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా మాదం వినోద్, ఉపాధ్యక్షుడిగా రాజారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మోహన్, జలందర్‌గౌడ్, వల్లి భీమయ్య, బల్లం రాజేష్, గణేష్, హనుమంతు, ముబీన్‌పాషా, మామిడి రమా, ఏలేటి మహేష్, రాజరెడ్డిలను నియమించారు.

అన్ని వర్గాల శ్రేయస్సే కాంగ్రెస్ ధ్యేయం

మల్లాపూర్, నవంబరు, 22 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కాంగ్రెస్‌తోనే సాధ్యం అవుతుందని కిసాన్ సెల్ జిల్లా నాయకులు, మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్, ధాంరాజుపల్లి గ్రామాల్లోని ప్రధాన కూడల్లో జరిగిన ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో పలువురితో కలిసి పాల్గొని మాట్లాడినారు. ఈ సందర్భంగా కళా బృందం సంస్కృత ప్రదర్శన నిర్వహించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. జరిగిన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



పెద్దాపూర్‌లోని కొనుగోలు వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ లత

గొల్లపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసి తూకం వేసిన వరి ధాన్యం బస్తాలను వెంటనే కేటాయించిన మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం గొల్లపల్లి మండలం వెన్గుమట్ల, తిర్మలాపూర్ (పీడీ) గ్రామాల్లో ప్రభుత్వరంగ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు కేంద్రాలకు వచ్చిన ధాన్యం ఎంత. ఏ మేరకు రైతుల నుంచి ధాన్యం సేకరించారు. సేకరించిన ధాన్యం బస్తాలను మిల్లులకు రవాణా అయిందా..లేదా అంటూ అధికారులను ఆరా తీశారు. ధాన్యం తేమ శాతంను పరిశీలించారు. ట్యాబ్ డేటా ఎప్పటికప్పుడు ఎంటర్ చేయాలని అధికారులను, నిర్వాహకులకు ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో ఏలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీపీవో రఘువరణ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సాయిబాబా, ఏపీఎం త్రివేణి, మాజీ సర్పంచ్ ఎరవేణి రమేష్, స్థానిక రెవెన్యూ, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు, పాల్గొన్నారు.

సర్వే డాటా ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించాలి

సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆపరేటర్లను ఆదేశించారు. శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సర్వే డాటాను ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు ఏలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు, ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ లత

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 22 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు చేసిన వంద శాతం రైతుల వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ లత ఆదేశించారు. శుక్రవారం మండలంలోని రామరావుపల్లి, పెద్దాపూర్, చౌలమద్ది, రేగుంట, ఏఎస్సార్‌తండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కుప్పలు, రికార్డుల వివరాలు పరిశీలించి, కొనుగోలు చేసిన ధాన్యం, ట్యాబ్ ఎంట్రీ, లారీలు, హమాలీ తదితర వివరాలంటినీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, సివిల్ సప్లయ్ డీటీ ఉమాపతి, ఆర్ఐ ఉమేష్, సీఈవో ప్రవీణ్, అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

మల్లాపూర్: మల్లాపూర్ మండలంలోని సెర్ప్ ఆధ్వర్యంలో ముత్యంపేటలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ లత ఆకస్మికంగా తనిఖీ చేసారు.

కొనుగోలు కేంద్రంలో వరి కొను గోలు నిర్వహణ, ధాన్యం తూకం, మిల్లులకు తరలించిన వివరాలు, సీరియల్ తదితర రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వీరసింగ్, డీటీసీఎస్ ఉమాపతి, ఆర్ఐ సురేష్, ఏపీఎమ్ దేవరాజ్, సీసీ రాజు, నిర్వహకులు, రైతులు, పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి ఆలయంలో ప్రభుత్వ విప్ పూజలు



ఆలయంలో హారతి తీసుకుంటున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం పూజలు నిర్వహించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆయనకు వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారలను దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శారదా శంకరాచార్యులు, గణపతి ఆలయంలో స్వామి వారలకు పూజలు చేసి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. అలాగే ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర, ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగన భట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే ఆన్‌లైన్‌కు కసరత్తులు..

(5వ పేజీ తరువాయి)

జిల్లా వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే మరో రెండు, మూడు రోజుల్లో పూర్తి కానున్నట్లు అధికార వర్గాలు అంటున్నాయి. ఆయా గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో ఇళ్ల జాబితా నమోదు, ఇంటింటికి స్టిక్కర్స్ అంటించడంతో పాటు ఇంటింటి సర్వేను చేపట్టారు. ప్రభుత్వం ముద్రించిన నిర్ణీత ఫార్మాట్‌ల ఎన్యుమరేటర్లు కుటుంబ వివరాలను సేకరించడం ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభించారు. 75 ప్రశ్నలకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన సమాచారాన్ని ఎన్యుమరేటర్లు సూపర్‌వైజర్లకు అందిస్తుండగా, రెండు రోజులుగా సర్వే వివరాల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 2,256 బ్లాక్‌లను గుర్తించి 3,37,126 కుటుంబాల గృహాలకు స్టిక్కర్లు అతికించారు. ఇందులో ఈనెల 21వ తేదీ వరకు 3,21,988 కుటుంబాలల్లో 95.51 శాతం సర్వే పూర్తి చేశారు. మిగిలిన 15,138 కుటుంబాల సర్వే నిర్వహించాల్సి ఉంది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల్లో 83,935 కుటుంబాలకు గానూ 78,069 కుటుంబాల సర్వే 93.01 శాతం పూర్తి అయింది. జిల్లాలోని 20 మండలాల్లో 2,53,191 కుటుంబాలకు గానూ 2,43,919 కుటుంబాల సర్వే 96.34 శాతం పూర్తి అయింది. మున్సిపాలిటీల్లో 5,866 కుటుంబాలు, గ్రామ పంచాయతీల్లో 9,272కుటుంబాల సర్వే చేయాల్సి ఉంది. దాదాపుగా రానున్న రెండు, మూడు రోజుల్లో వంద శాతం సర్వే పూర్తి చేసే దిశగా అధికారులు ప్రయత్నం చేస్తున్నారు.

పకడ్బందీగా నిర్వహణ



సత్య ప్రసాద్, జిల్లా కలెక్టర్, జగిత్యాల

జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నాము. జిల్లాలో సర్వే దాదాపుగా పూర్తి అవుతోంది. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియపై సైతం దృష్టి సారించాము. సకాలంలో సర్వే ప్రక్రియ పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము.

రైతులు మధ్యవర్తులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దు

విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్

వెల్గటూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ బావులకు సంబంధించి విద్యుత్ కనెక్షన్‌కు మధ్యవర్తులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని వెల్గటూర్ విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో సూచించారు. వ్యవసాయ బావులకు కట్టే డీడీలు కాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌కు, లైన్‌కు అదనంగా డబ్బులు కట్టాల్సి ఉంటుందా? అని రైతులు తరచుగా అడుగుతున్నారని అన్నారు. వ్యవసాయ బావులు కనెక్షన్‌కు 5 హెచ్‌పీకి రూ. 5295లు, 7.5 హెచ్‌పీకి రూ.8200లు నేరుగా మీసేవా కేంద్రాలలో కట్టాలని కోరారు. లైన్ మెన్ సర్వీస్‌కు అర్హత ఉందా? లేదా? నిర్ధారిస్తాడని తెలిపారు. ఏఈ, ఏడీఈలకు డబ్బులు ఇవ్వాలని మధ్యవర్తులు చెప్పే మాటలు విని వారికి రైతులు అందరు కలిసి డబ్బులు జమ చేసి ఇవ్వవద్దని కోరారు. వ్యవసాయ సర్వీస్‌కు స్పెస్ స్కీం కింద ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఉంటే రూ.70 వేలు, కేవలం స్తంభాలు మాత్రమే అవసరం ఉంటే రూ.45 వేలు నేరుగా మీసేవలో కట్టాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ అంచనా దాటితే మాత్రం ఓఆర్‌సీ వస్తుందని దానిని రైతులు కట్టుకోవాలని తెలిపారు.

డీఎస్పీ సన్మానించిన నాయకులు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అడ్డూరి రాములును శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖుతుబోద్దిన్ పాషాలు సన్మానించి అభినందించారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో అడ్డూరి రాములును కలిసి శాలువాతో సత్కరించి స్థానికంగా ఉన్న విషయాలపై చర్చించారు.

రైతు ప్రయోజనాలకు కృషి చేస్తున్న సీఎం

మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి

కోరుట్ల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతు ప్రయోజనాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నాడని మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలో సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనసును రైతు ఖాతాలో జమచేయడాన్ని స్వాగతిస్తూ రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులతో పాటు రాష్ట్ర మంత్రుల చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడారు. ఎన్నికలో ఇచ్చిన హామీలో రాష్ట్ర ప్రభుత్వం నేరవేరుస్తుందని అన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ బోనస్ ఇచ్చిందని ఈ పథకంతో ఎకరా సన్న వడ్లకు రూ. 15000 వరకు లబ్ధిపొందుతారని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు, సుధీర్, గడ్డం హన్మక్క, నగునూరి గంగాధర్ గౌడ్, ముక్కెర రాజేష్, గోపిడి నారాయణ, కుర్మ తిరుపతి, తోట్ల మహేష్, సందరగిరి మధు, బింగినరం శివ రైతులు పన్నాల లింగారెడ్డి, ఇప్ప స్వామి, కాలగిరి గంగారెడ్డి, పెద్దిరెడ్డి రాజారెడ్డి, నడిపన్నలతో పాటు పలువురు పాల్గొన్నారు.



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్

మల్లాపూర్, నవంబరు, 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మల్లాపూర్‌లోని కేజీ బీవీ మిని గురుకులంను తహసీల్దార్ వీరసింగ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. మెన్ వివరాలు పరిశీలించారు. వంట, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఆకస్మికంగా రేవెన్యూ అధికారులను సందర్శించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ఐకేపీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈయన వెంటా ఎంపీడీవో జగదీష్, ఆర్ఐ సురేష్, సెర్ప్ అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సుందరంగా తీర్చిదిద్దేందుకే మొక్కల పరిరక్షణ

- మున్సిపల్ కమిషనర్ మోహన్



మొక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై డివైడర్లలో నాటిన మొక్కలను సుందరంగా తీర్చిదిద్దేందుకే వాటిని పరిరక్షిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మోహన్ తెలిపారు. శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారిపై డివైడర్లలో ఏర్పాట చేసిన మొక్కలను పరిశీలించి వాటిలో పిచ్చి మొక్కలు మొలువకుండి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రతి రోజు నాటిన మొక్కలను నీరు అందించి గడ్డిని వెంటది వెంటనే తొలగించాలని అన్నారు. పెరిగి మొక్కలను ఎప్పడికప్పుడు కట్టు చేసి సుందరంగా తీర్చిదాదాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్, నరేష్‌లతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తహసీల్దార్‌కు వినతి

కథలాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధిక సంఖ్యలో ఉన్నారని వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని శుక్రవారం డీఎస్పీ నాయకులు తహసీల్దార్ వినోద్‌కు వినతి పత్రం అందించారు. ప్రతీ గ్రామంలో ఆధునిక ఆసుపత్రి, అర్హతలను బట్టి ఉపాధి అవకాశాలు, పేదలకు 200 గజాల విస్తీర్ణంతో కూడిన ఇళ్లు, సాగునీటి సదుపాయం గల ఎకరం భూమి అందించాలని డిమాండ్ చేశారు. ఈ ఐదు పథకాలకు అంబేద్కర్, సాహూ మహరాజ్, పూలే, కాన్షీరాం పేరు పెట్టి పేదల జీవితాల్లో ఆర్థిక, సాంస్కృతి, సామాజిక మార్పులు తీసుకురావాని విన్నవించారు. దూలూరు గంగరాజం, సురేశ్, వంశీ, తిరుపతి, రమేశ్ ఉన్నారు.

'మన ఊరు-మన బడి' పనులు పరిశీలన

బుగ్గారం, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు మన బడి పనులను శుక్రవారం నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ దిలీప్ చంద్ర, జిల్లా సెక్టార్ అధికారి సత్యనారాయణలు పరిశీలించారు. పాఠశాలలోని డిజిటల్ తరగతి గదులు, తాగు నీరు వసతి, మొదలగు వాటిని పరిశీలించారు. పాఠశాలలో మెరుగుపరచాల్సిన మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

జగిత్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ కాల్వ సుజాతను శుక్రవారం జిల్లా ఆవోపా నాయకులు పబ్బ శ్రీనివాస్ సన్మానించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో చైర్మన్ కాల్వ సుజాతను మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలన, చిత్తశుద్ధికి..

సూరమ్మ చెరువు పనులే నిదర్శనం

● ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



చెరువు మత్తడి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో సూరమ్మ చెరువు పనులు ప్రారంభించి ప్రజాపాలనను నిరూపించుకున్నామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కలికోట సూరమ్మ చెరువు మత్తడి, కట్ట నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భీమారం, మేడిపల్లి, కథలాపూర్ మండలాల వరప్రదాయినిగా ఉన్న సూరమ్మ రిజర్వాయర్ నిర్మాణ పనుల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. 2015లో అప్పటి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్ 2 ఫేజ్ 1లో భాగంగా రు. 1737 కోట్లు మంజూరు చేసి సూరమ్మను పంపులతో నింపాలని ప్రతిపాదించారని అన్నారు. ఆనాడు జరిగిన పనులే తప్ప పదేళ్ళ బీఆర్ఎస్ తట్టెడు మట్టి కూడా తీయలేదని అన్నారు. 2018లో అప్పటి భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు రు. 204 కోట్లతో కుడి, ఎడమ కాలువల పనులకు శంఖుస్థాపన చేసి వదిలేశారని కనీసం భూసేకరణకు నిధులు కూడా విడుదల చేయలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు పూర్తి చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం మొదటి విడతగా భూసేకరణకు రు. 10 కోట్లు విడుదల చేయించామ న్నారు. కుడి, ఎడమ కాలువల్లో సుమారు 520 ఎకరాల మేర భూములు రైతులు కోల్పోతున్నారని ఇందుకు నోటిఫికేషన్ జారీ చేశామని ఆర్డీవో ఆధ్వర్యంలో గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి నష్టపరిహారం చెల్లించే ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధి, ఇతర మండలాల్లో పనులకు దాదాపు వెయ్యి కోట్లు సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేయడం తమ చిత్తశుద్ధికి తార్కాణమన్నారు. మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు 4696 ఇండ్ల కోసం రు.32.80 కోట్లు మంజూరు చేయడంతో వారికి ఎంతో న్యాయం జరుగుతోందన్నారు.

మోత్కురావుపేట, గోవిందారం, రుద్రంగి రోడ్డు నిర్మాణంకు అటవీశాఖ నుంచి కొద్ది రోజుల్లో క్లియరెన్స్ రాబోతోందని ఇది ఎన్నో ఏళ్ల కళ అన్నారు. యార్న్ డిపోకు రు. 50 కోట్లు విడుదల చేయడంతో కూలీలేయ జమానులు కాబోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సంతు ప్రకాశ్‌రావు, కోరుట్ల ఆర్డీవో జికేందర్‌రెడ్డి, తహసీల్దార్ వినోద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ నగేశ్, పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, కల్లెడ గంగాధర్, పులి హరిప్రసాద్, ఎగ్యారపు శ్రీహరి, అల్లకొండ లింగంగౌడ్, స్వామిరెడ్డి, వాకిటి రాజరెడ్డి, బైర దేవ్ ఉన్నారు.

నూతన నియామకంపై హర్షం

మెట్‌పల్లి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా అల్లూరి రాంరెడ్డి, జాయింట్ సెక్రటరీగా ప్రణయ్‌ల ఎంపికపై మెట్‌పల్లి బార్ అసిసోయేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, అసోసియేషన్ సభ్యులు రాంబాబు, వేణుగోపాల్‌లు హర్షం ప్రకటించారు. వేంపేట గ్రామానికి చెందిన అల్లూరి రాంరెడ్డి రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వెల్ఫేర్, డిపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికవ్వడం, మెట్‌పల్లిల్లి మున్సిఫ్ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నికను స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు.

అస్తమాతో నిరుపేద మృతి

● అంత్యక్రియలు జరిపించిన పోలీసులు

వెల్గటూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్తంభంపల్లి గ్రామ శివారులో ఉంటున్న నిరుపేద వ్యక్తి కమల్ సింగ్ చితోడియా (55) శుక్రవారం అస్తమాతో మృతి చెందాడు. మృతుడు స్తంభంపల్లి శివారులో మూలికలు అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. అస్తమాతో ఆరోగ్యం క్షీణించి మృతి చెందాడు. అంత్యక్రియలు జరిపించడానికి కూడా వారి కుటుంబానికి స్తోమత లేక వెల్గటూర్ పోలీసులను ఆశ్రయించారు. స్పందించిన పోలీసులు అంత్యక్రియలు జరిపించారు.

ఆధునిక సాంకేతిక విధానాలను అందిపుచ్చుకోవాలి

● ఏరువాక కేంద్రం డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

కథలాపూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయరంగంలో చోటు చేసుకుంటున్న పరిమాణాల నేపథ్యంలో రైతాంగం ఆధునిక విధానాలను అందిపుచ్చుకుని సాగుకు ఉపక్రమించాలని జిల్లా ఏరువాక కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం వ్యవసాయ ప్రదర్శన యాసంగిలో పంటల సాగు ప్రణాళికపై రైతులతో రైతు సదస్సు నిర్వహించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సరళిని మార్చుకుని అధిక ఆదాయాలను ఇచ్చే పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. వరికొయ్యలను తగు లబెట్టకూడదని ఎరువుల యాజమాన్యం పాటించాలని కోరారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ విద్యార్థులు వ్యవసాయ ప్రదర్శన ఏర్పాటు చేసి వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మధుకర్‌రావు, శ్రావణి, రాజేంద్రప్రసాద్, వెంకట్రావు, ఏవో యోగిత, ఏఈఓలు శేఖర్, మౌనిక, హరీశ్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన గుండేటి రమేష్‌సరస్వతి దంపతులు శుక్రవారం 51వేల116 రూపాయల నగదును ఆలయ పూజారి నాగరాజు రమేష్‌కు అందించారు. దాత కుటుంబానికి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

● మండల కేంద్రంలో శుక్రవారం ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను మండల ప్రత్యేక అధికారి చరణ్‌దాస్ పరిశీలించారు. కుటుంబ సభ్యుల వివరాలను, పూర్తి సమాచారాన్ని ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ప్రత్యేక అధికారి వెంట కొడిమ్యాల కార్యదర్శి వంశీవర్ధన్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కోరుట్ల : పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు కోరుట్ల పట్టణ వాసి రుద్ర శ్రీనివాస్‌ను రాష్ట్ర పద్మశాలి సంఘ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాస్ రావు నియమించారు.

మెట్‌పల్లి రూరల్ : ఆత్మరక్షణతో పాటు సమాజ రక్షణకు కరాటే ఎంతో అవసరమని ప్రధానోపాధ్యాయుడు భూమచారి, కరాటే శిక్షకులు మాస్టర్ ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర సర్వశిక్ష అభియాన్ శిక్షణలో భాగంగా శుక్రవారం మండలంలోని విట్టంపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని బాలికలకు కరాటే శిక్షకులు తరగతులు మాస్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మాస్టర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకులు ప్రవీణ్‌కుమా ర్, విశ్వతేజ, విశ్వంత్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని వర్షకొండ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్ష కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో విద్యార్థినులకు కరాటే శిక్షణ తరుగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కరాటే శిక్షణను అవినాష్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడిపల్లి : కట్లకుంట గ్రామంలోని వ్యవసాయ పొలాలలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిందని పోలీసులు తెలిపారు. దాదాపు (40) సంవత్సరాల వయస్సు గల మగ వ్యక్తి మృతదేహం ఉందని, తెలిసిన వారు ఎస్సైని సంప్రదించాలని తెలిపారు.